సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 23 । జూన్ । 2024



నమో వేంకటేశాయ!

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



సంగీతజ్ఞుడికి సత్కారం

విశాఖ: సంగీత జనకులం ద్వారా 23 సంవత్సరాలకు పైగా శాస్త్రీయ సంగీత వైభవానికి సేవలందిస్తున్న ఆకొండి వెంకట్రావును శనివారం ఘనంగా సత్కరించారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/24.2

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రారంభం

తుమ్మపాల: ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించేందుకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్)' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమం తరహాలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దరఖాస్తుదారుల కోసం మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని డీఆర్వో చెప్పారు.

గోశాలలో ఏరువాక పున్నమి పూజలు



దుక్కి దున్నుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శనివారం ఏరువాక పున్నమి పూజలను విశేషంగా నిర్వహించారు. గోశాలలో ఉన్న వ్యవసాయ భూముల్లో వ్యవసాయ పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి నాగలికి, ఎడ్లకి పూజలు నిర్వహించారు. అనంతరం భూమి పూజ నిర్వహించి దున్నే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏరువాక పున్నమిగా జ్యేష్ఠ పౌర్ణమిని అభివర్ణిస్తారని తెలిపారు. ఏరువాక పున్నమిరోజు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులంతా తమ పొలాల్లో భూమి పూజ చేస్తారని తెలిపారు. తదుపరి నాగలి, ఎడ్లతో భూమిని దుక్కి దున్నే ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరి, సూపరింటెండెంట్ వై.అప్పారావు, వేద పండితులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.వి.ఆర్.రాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.వి.ఆర్.రాజు



ఆచార్య పద్మశ్రీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగ ఆచార్యులు ఎం.వి.ఆర్.రాజు నియమితులయ్యారు. శనివారం ఆచార్య కె.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఆర్.పద్మశ్రీ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా దేబస్నాన పూర్ణిమ



పూజలు చేస్తున్న జె.కె.నాయక్

బీచ్‌రోడ్డు (విశాఖ): జగన్నాథ ధామ్ పూరీ ఆచారాన్ని అనుసరిస్తూ దసపల్లా హిల్స్‌లోని ఉత్కళ్ సంస్కృతీ సమాజ్‌లో శనివారం ఘనంగా దేబ స్నాన పూర్ణిమ (స్నాన యాత్ర) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ జగన్నాథుడు, శ్రీబలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ సుదర్శన చక్ర దేవతలకు సువాసనతో కూడిన 108 కుండల నీటిని గర్భగుడిలోకి యాత్రగా తీసుకెళ్లారు. ఈ యాత్రకు వందలాది మంది భక్తులు విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారని ఉత్కళ్ సమాజ్ అధ్యక్షుడు జె.కె.నాయక్ తెలిపారు. 14 రోజుల పాటు రాత్రి సమయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అనసారా స్నానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్ సాహు, బిమల్‌కుమార్ మహంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు రక్ష... భూసార పరీక్ష

రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా.. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా.. ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. మట్టి స్వభావం తెలుసుకోవాలన్నా.. భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా.. ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలన్నా.. పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వాడితే రైతుకు పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

- పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు 12 రకాల పరీక్షలు
- ఫలితాలను బట్టి నేలకు పోషకాలు
- మట్టి స్వభావం ఆధారంగా పంట, అధిక దిగుబడి
- ఖరీఫ్‌లో భూసార పరీక్షల నిర్వహణకు సన్నద్ధం



మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు (ఫైల్)



మట్టి నమూనా పరీక్షిస్తున్న ల్యాబ్ సిబ్బంది (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. రైతు వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు, ఎరువుల ఆధారంగా భూమిలో మార్పులు చెందుతుంటాయి. ఆ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. వ్యవసాయం చేస్తేనే పంటలు బాగా పండుతాయి. విచక్షణారహితంగా ఎరువులను, పురుగు మందులను వాడడం ద్వారా భూమి పటుత్వం కోల్పోతుంది. వీటిని అధిగమించి రైతు సకాలంలో పంటలు వేస్తూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా.. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహిస్తోంది. విత్తడానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారుల ద్వారా సూచనలు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 450 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 18,800 మట్టి నమూనాలను పరీక్షించే విధంగా లక్ష్యం పెట్టుకున్నారు. ఒక్కో ఆర్బీకే పరిధిలో రైతు కమతాల నుంచి కనీసం 40 మట్టి నమూనాలను సేకరించేలా వ్యవసాయాధికారులు ఆదేశించారు. నమూనాలను అనకాపల్లిలో ఆర్ఏఆర్ఎస్‌లో సాయిల్ టెస్ట్ ల్యాబ్‌లకు తీసుకొస్తారు. అత్యధికంగా చోడవరం మండలంలో 26 ఆర్బీకేల పరిధిలో 1,409 మట్టి నమూనాలు, అత్యల్పంగా పరవాడ మండలంలో 12 ఆర్బీకేల పరిధిలో 319 మట్టి నమూనాలు తీసుకునేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు.

సూక్ష్మ పోషకాల లభ్యత

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. ఈ సమయంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా భూమి యాజమాన్య చర్యలు తీసుకోవాలి. ఎరువులు సమర్థంగా, పొదుపుగా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవచ్చు. రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు 12 రకాల పరీక్షలు చేయనున్నారు. మట్టి పీహెచ్ (ఉదజని సూచిక), లవణ సూచిక (ఈసీ), సేంద్రియ కర్బనం (ఓసీ), స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాషియం, ఐరన్, జింక్, మాంగనీస్, కాపర్, బోరాన్, సల్ఫర్ పరీక్షలు చేస్తారు. ఇవన్నీ సమతుల్యంగా ఉంటేనే పంటలు అధిక దిగుబడి వస్తాయి. అంతేకాకుండా భూమిలో చౌడు.. సున్నం గుణాలు.. విష పదార్థాల కలయిక (భూ కాలుష్యం జరిగినప్పుడు) గుర్తించి అవసరమైన యాజమాన్య పద్ధతుల్ని పాటించేందుకు అవకాశం ఉంటుంది. భూసార పరీక్షలు మూడు దశల్లో నిర్వహిస్తారు. ముందుగా ఎంచుకున్న పొలంలో మట్టి సేకరణ, సేకరించిన నమూనాలు ప్రయోగశాలకు చేర్చడం, అనంతరం ఫలితాల ఆధారంగా గుర్తించిన లోపాలకు తగిన ఎరువులు వినియోగించడం తప్పనిసరి. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ప్రయోగశాలలో ఈ భూసార పరీక్షలను చేస్తున్నారు.



సాయిల్ ల్యాబ్

ఆర్బీకేల వారీగా భూసార పరీక్షలు..



ఇప్పటికే ఆర్బీకేల ద్వారా శాఖాపరంగా ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రయోగశాల నుంచి ఫలితాలను బట్టి నేలకు అవసరమైన స్థూల పోషకాలను అందిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించే అవకాశం ఉంది. భూసార పరీక్షలపై సిబ్బందికి ఇప్పుడు శిక్షణ కూడా ఇచ్చాం. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించుకుంటే తక్కువ ఖర్చుతోపాటు అధిక దిగుబడి పొందవచ్చు. సాయిల్ హెల్త్ కార్డు (ఎస్‌హెచ్‌సీ) యాప్‌లో జీపీఎస్ ద్వారా క్యూఆర్ కోడ్ ఉపయోగించి మట్టి నమూనాలను సేకరిస్తాం.

– మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

రక్తహీనత నివారణే లక్ష్యం

- జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం



కిశోర బాలిక రక్తనమూనా సేకరిస్తున్న బృంద సభ్యులు

మాకవరపాలెం: గర్భిణులు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. ఈ బృందం సభ్యులు లూసీ, రామచంద్రరావు, జగదీష్ శనివారం మండలంలోని పి.పి.అగ్రహారంలో పర్యటించారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో పాటు, సబ్ సెంటర్‌లో గర్భిణుల రక్తశాతాన్ని పరిశీలించారు. తక్కువగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. లేకుంటే అనారోగ్యాల బారిన పడక తప్పదన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీతారామలక్ష్మి, పీహెచ్ఎన్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

'సుభాష్ చంద్రబోస్' పురస్కారాలకు దరఖాస్తులు

మహారాణిపేట (విశాఖ): సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాల కోసం విపత్తుల నిర్వహణలో కృషి చేసిన సంస్థలు, వ్యక్తుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జనవరి 23న సంస్థకు రూ.51 లక్షలు, వ్యక్తి రూ.5లక్షలు చొప్పున నగదు పురస్కారాలను అందజేస్తారని పేర్కొన్నారు. 2024 జూలై 01 నుంచి 2024 ఆగస్టు 31 వరకు https://awards.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ సైట్ ఓపెన్ అవుతుందని వెల్లడించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

- ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: రైతులు నారుమడులు తయారు చేసుకునేందుకు సిద్ధం కావాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నూతన ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులతో శనివారం టీ అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావలసిన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులను అందజేయడానికి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులు నారుమడులు తయారు చేసుకోవడానికి సమాయత్తమవుతున్నారని, సరైన వర్షాలు నమోదైతే జూలై మొదటి వారం నుంచి ఈ పనులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌జేఎల్–2537 వరి విత్తనాలు, ఎలమంచిలి – 66 నువ్వు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్టు ఆయన చెప్పారు. కె.వి.కె. కొండెంపూడిలో 30 క్వింటాళ్ల ఆర్‌జేఎల్–2537 వరి విత్తనాలు, ఎలమంచిలి–66 నువ్వు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. వ్యవసాయ అధికారుల కోరిక మేరకు ఆర్.ఎ.ఆర్.ఎస్ ఎంటీయూ–1262 రకం విత్తనాన్ని రెండు ఎకరాల్లో పండించి రైతులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు, ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అప్పన్నకు చందన సమర్పణ

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మూడవ విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున స్వామిని మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణలతో మేల్కొలిపారు. సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ భాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల (120కిలోల) పచ్చి చందనాన్ని అర్చకులు తీసుకొచ్చి స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

విశేషంగా పంచకలశ స్నపనం

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం పంచకలశ స్నపనాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో అభిషేకాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి చందన సమర్పణ చేసి.. విశేషంగా హారతులిచ్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు గిరి, పెద్దరాజు, పవన్ కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చకచకా పాఠ్యపుస్తకాల పంపిణీ

- వచ్చిన వెంటనే విద్యార్థులకు అందించాలి
- విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటి వరకు వచ్చిన పాఠ్యపుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలని విద్యాశాఖ విశాఖ జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయ్‌భాస్కర్ చెప్పారు. వేల్పులవీధిలోని జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వివిధ మండలాల ఎంఈవోలతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంత వరకు అందిన పాఠ్యపుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలని, మండల విద్యాశాఖ కార్యాలయంలో కిట్లకు సంబంధించి ప్రతి ఐటమ్‌కు ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమించాలని ఆయన కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాల కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని, మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో సమయానుకూలంగా రైస్, చిక్కీలు, గుడ్ల ఇండెంట్‌ను ప్రభుత్వానికి అందజేయాలని ఆయన తెలిపారు. బడి ఈడు పిల్లలను, మధ్యలో బడి మానేసిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఎంఈవోలు, ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అమ్మ..

ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్

- కంటికి రెప్పలా కాపాడుతూ విద్యాబుద్ధులు
- ఉద్యోగం వచ్చే వరకూ సంరక్షణ
- నేడు ఎస్‌వోఎస్ డే

భీమునిపట్నం: అనాథ పిల్లలను ఆదరించి బాగోగులు చూసి మంచి భవిష్యత్తును అందిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది భీమిలిలో ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్. ఆస్ట్రియా దేశానికి చెందిన హెర్మన్ మైనర్ అనే మహానుభావుడు ఈ చిల్డ్రన్స్ విలేజ్ ఏర్పాటుకు కారకుడు. రెండో ప్రపంచ యుద్ధం పూర్తయిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది పిల్లలు తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిపోయారు. వీరిని చూసి చలించిపోయిన హెర్మన్‌మైనర్ వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో 1949లో ఆస్ట్రియా దేశంలో మొదటి చిల్డ్రన్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత ప్రపంచ వ్యాప్తంగా 132 దేశాల్లో 500 విలేజ్‌లు ఉండగా భారతదేశంలో మొదటి విలేజ్ 1962లో ప్రారంభం కాగా ఇప్పుడు దేశవ్యాప్తంగా 32 విలేజ్‌లు ఉన్నాయి. మన రాష్ట్రంలో విశాఖ జిల్లా భీమిలి సమీపంలో 1997లో విశాలమైన ప్రాంతంలో 14 ఇళ్లతో కూడిన చిల్డ్రన్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత తిరుపతి, హైదరాబాద్‌లలో మరో రెండు ఏర్పాటయ్యాయి.

అన్ని ప్రాంతాల్లోని విలేజ్‌లతోపాటు ఇక్కడ కూడా ఇంటికి ఒక మదర్ ఉంటారు. అందులో పదిమంది వరకు పిల్లలు ఉంటారు. వీరిని మదర్ ఎటువంటి లోటు లేకుండా పెంచి పెద్ద చేస్తారు. వారికి మంచి చదువు చెప్పించడంతోపాటు ఉద్యోగాలు వచ్చే విధంగా చూస్తారు. ఆడ పిల్లలకు వివాహాలు చేసి పంపుతారు. ఈ విలేజ్‌కు ఒక డైరెక్టర్, పలువురు సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం ఇక్కడ 84 మంది పిల్లలు ఉన్నారు. కాగా 13 ఏళ్లు వచ్చిన మగ పిల్లల్ని మరో ప్రాంతంలో ఉండే యూత్ హాస్టల్‌లో ఉంచి చదివిస్తారు. ఇలా ఈ చిల్డ్రన్స్ విలేజ్‌లో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వారిని ఎంతో బాధ్యతగా ప్రేమతో పెంచి బంగారు భవిష్యత్తును అందిస్తున్నారు.



2007లో దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డికి రాఖీ కడుతున్న బాలిక



ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ విగ్రహం

నేడు ఎస్‌వోఎస్ డే

ఆదివారం విలేజ్‌లో ఎస్‌వోఎస్ డే వేడుకను నిర్వహించనున్నారు. దీని వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. చదువు, క్రీడల్లో రాణించిన పిల్లలకు బహుమతులు అందజేస్తామన్నారు.



రంగు కాయితాలతో బొమ్మలు తయారు చేస్తున్న పిల్లలు



పదేళ్ల క్రితం ఇక్కడ విలేజ్‌లో జరిగిన హోలీ వేడుకలో పాల్గొన్న క్రికెటర్ విరాట్ కోహ్లి

విదేశాల్లో మే కాల్ డే ఉత్సవాలు

తాటిచెట్లపాలెం (విశాఖ): లోకహితార్థం జీవించిన పరమ గురువుల బోధనలు, వారు చూపిన మార్గం నేడు భౌగోళికంగా వ్యాప్తి చెందాయని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. మాస్టర్ సి.వి.వి. తన యోగ మార్గాన్ని ఉపదేశించిన మే 29న ప్రతీ ఏటా మే కాల్ డేగా పాటిస్తారు. సత్యదేవ్ ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో నిర్వహించిన తన 4వ యాత్రను ముగించుకుని నగరానికి చేరుకున్నారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం పలు విషయాలను ఆయన వెల్లడించారు. అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో గల లాస్ క్రూసెస్, థావోస్, డల్లాస్ నగరాల్లో మే కాల్ డే సందర్భంగా ఉత్సవాలు, సత్సంగాలు, పూజాది క్రతువులను జరిపానని చెప్పారు. మాస్టర్ సి.వి.వి. ప్రార్థన, యోగ మార్గంపై విదేశీయులు ఆసక్తి చూపుతున్నారని, మాస్టర్ ఇ.కె.రచనలు వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు రాసిన అనేక గ్రంథాలు జర్మనీ, స్పెయిన్ దేశాల్లో వారి వారి భాషల్లో అనువాదమై, పాశ్చాత్యుల ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగపడుతున్నాయని వివరించారు.



అగ్నిహోత్ర క్రతువు నిర్వహిస్తున్న సత్యదేవ్

జెడ్పీటీసీ రమణమ్మ మృతి తీరని లోటు


రమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ


రమణమ్మ సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

చోడవరం: రావికమతం మండల అభివృద్ధికి ఎంతో కృషిచేసిన జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ మృతి మండల ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె సంస్మరణ సభను కొత్తకోటలో శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి సానుభూతిని తెలియజేసి, వారికి అన్ని విధాలుగా తోడుగా ఉంటానని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ జెడ్పీటీసీగా రావికమతం మండలాన్ని రమణమ్మ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రమణమ్మ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీలు పైలరాజు, శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కంచిపాటి జగ్గారావు, ముక్కా మహాలక్ష్మినాయుడు, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సభ్యులు

అనకాపల్లి: నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నీట్ పరీక్షలో అక్రమాలను నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై తక్షణమే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడానికే నిర్ణయించుకుందన్నారు. నీట్ స్కాంపై అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర, ప్రధాని స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్టు అంగీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీట్ అక్రమాలపై విచారణ జరిపిస్తామని కాని, అభ్యర్థులకు న్యాయం చేస్తామని కానీ ప్రభుత్వం ప్రకటించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. నీట్‌లో అవకతవకలే జరగలేదని కేంద్ర ప్రభుత్వం చెబుతూ వచ్చిందని, గుజరాత్‌లో అవకతవకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయిందని ఆయన తెలిపారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లు, ఉపాధ్యాయులపై కేసులు నమోదుచేసి, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. మరోవైపు ఎన్డీఏ పాలనలోని బిహార్‌లో ప్రత్యేకంగా సిట్‌ను వేసి దర్యాప్తు చేయిస్తున్నారని, ఇప్పటికి 13 మందిని అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ నాయకుల హస్తం ఉందని, దీన్నిబట్టి చూస్తుంటే బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగా నీట్ స్కాం విస్తరించినట్లు అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా ముకుందరావు


ఏడీఆర్ ముకుందరావుకు అభినందనలు తెలుపుతున్న శాస్త్రవేత్తలు

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్‌గా డాక్టర్ సీహెచ్.ముకుందరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఆర్ఏఆర్ఎస్‌లో వృక్ష శరీర ధర్మశాస్త్ర విభాగం ప్రధాన శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్లపాటు ఏడీఆర్‌గా వ్యవహరించిన పి.వి.కె. జగన్నాథరావు ఆర్ఏఆర్ఎస్‌లో పంట కోత అనంతర విభాగం ప్రధాన శాస్త్రవేత్తగా కొనసాగుతారని ముకుందరావు చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన ముకుందరావుకు పలువురు శాస్త్రవేత్తలు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న స్వతంత్ర జర్నలిస్టు, ప్రముఖ యూ ట్యూబర్ సి.వనజ

సీతంపేట(విశాఖ): పురుషులతో పాటు మహిళలు సమానత్వం కోసం దీర్ఘకాలిక ఉద్యమం చేయాలని స్వతంత్ర జర్నలిస్టు, ప్రముఖ యూ ట్యూబర్ సి.వనజ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) 50 ఏళ్ల ప్రస్థానాన్ని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణపై స్థానిక పౌరగ్రంథాలయంలో శనివారం జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళా ఉద్యమ నిర్మాణంలో పీవోడబ్ల్యూ 50 సంవత్సరాల ప్రయాణం, వర్తమానంలో మహిళా ఉద్యమ కర్తవ్యాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రారంభ ఉపన్యాసం చేసారు. జీవితంలో అనేక రకాలైన హింసలను మహిళలు భరిస్తున్నారని, హింస లేని జీవితం లేదని, ముఖ్యంగా సామాన్య ప్రజలు దీనికి బలవుతున్నారని అన్నారు. వాడు మగాడు ఏమైనా చేస్తాడు అనే ధోరణి ఇంకా ఉందంటే అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఆడపిల్లలను ఒంటరిగా బయటకు పంపించడానికి భయపడుతుంటారని, సమాజంలో సమానత్వం కనిపించడం లేదన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో ప్రచారం కోసం వేల కోట్లు ఖర్చుపెట్టిందని, మహిళల రక్షణపై మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని మాట్లాడుతూ ఆంధ్రాలో మహిళలపై దాడులు, అత్యాచారాలు ఇటీవల ఎక్కువయ్యాయన్నారు. పీవోడబ్ల్యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సంధ్య మాట్లాడుతూ 1974 నుంచి పీవోడబ్ల్యూ అనేక అంశాలపై ప్రజా ఉద్యమాలు చేస్తోందన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రతినిధి ఎస్.విష్ణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి వర్తమాన ఉద్యమ లక్ష్యాలను వివరించారు. ఈ సదస్సులో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామమూర్తి, పలు ప్రజా, మహిళా సంఘాల ప్రతినిధులు అనూరాధ, లలిత, వెంకటేశ్వర్లు, పద్మ, మణి, భారతి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విశాఖ సహకార బ్యాంక్ లక్ష్యం రూ.8వేల కోట్లు


మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు

- బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు

సీతమ్మధార(విశాఖ): విశాఖ సహకార బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లక్ష్యం రూ.8 వేల కోట్లుగా నిర్ణయించినట్లు ఆ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రూ.7,300 కోట్ల మైలురాయిని అధిగమించామన్నారు. బ్యాంక్ ప్రస్తుతం 1,04,865 మంది సభ్యులు, రూ.352.61 కోట్ల షేర్ ధనంతో దేశంలోనే అతి పెద్ద పట్టణ సహకార బ్యాంకుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుందన్నారు. సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత బీమా సదుపాయం ఉందని, రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి నాలుగు శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2596 మందికి రూ.5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. 108వ వార్షిక మహాజన సభ నిర్ణయం మేరకు రూ33.56 కోట్లను సభ్యులకు షేరు ధనం మీద డివిడెండ్‌గా చెల్లించామన్నారు. ఐదు కొత్త శాఖలఏర్పాటులో భాగంగా ఈ నెల 20న షీలానగర్‌లో 51వ శాఖను ప్రారంభించామని గుర్తు చేశారు. త్వరలోనే చిత్తూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో కొత్త శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే 14 శాఖలకు సొంత భవనాలు ఉన్నాయని, గాజువాక, గోపాలపట్నం శాఖలకు స్థలాలు, చోడవరం శాఖ సొంత భవనం కొనుగోలు చేశామన్నారు. బ్యాంక్‌లో డైలీ డిపాజిట్ పథకం అమల్లో ఉందన్నారు.

ఏడాది కాలవ్యవధిలో కోటికి పైగా డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.5,714 కోట్ల టర్నోవర్ జరిగిందని, గతేడాది రూ.87.79కోట్ల నికర లాభం సంపాదించామన్నారు. డిపాజిట్ల కింద రూ.4,148 కోట్లు, రుణాల కింద రూ.3,199 కోట్లు మంజూరు చేశామన్నారు. బ్యాంకు సీఈవో పి.వి.నరసింహమూర్తి, డైరెక్టర్లు మానం ఆంజనేయులు,జె.వి. సత్యనారాయణమూర్తి, స్టాలిన్, ఉప్పలపాటి పార్వతీదేవి, కామరాజు, చంద్రశేఖర్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ

చోడవరం రూరల్: రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీకాంత్ కల్యాణ మండపంలో సీపీఎం జిల్లా స్థాయి రెండురోజుల రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపని నాడు సీపీఎం పోరాటాలు చేస్తుందని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. చోడవరం సుగర్స్‌ను ఆధునికీకరించాలని, చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలని కోరారు. శిథిలమైన రోడ్లు, కల్వర్టులు, వంతెనలు వంటి పలు సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. వీటి పరిష్కారంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు. ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సీపీఎం ప్రజా పోరాటాలను చేపడుతుందని, దానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, ఎస్.వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. శిక్షణ తరగతుల్లో జిల్లా వ్యాప్తంగా 24 మండలాల నాయకులు, క్రియాశీల కార్యకర్తలు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

దేవరాపల్లి: బోయిలకింతాడకు చెందిన ఎలిశెట్టి లక్ష్మి(35) పాము కాటుకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.నాగేంద్ర శనివారం తెలిపారు. ఎలిశెట్టి లక్ష్మి శుక్రవారం తమ పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఈ విషయాన్ని తన భర్తకు ఫోన్ ద్వారా తెలియజేసింది. ఆయన పొలం వద్దకు చేరుకునే సరికే ఆమె అపస్మారక స్థితికి చేరింది. వెంటనే కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పలు రైళ్ల రద్దు.. రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ రైళ్లు కాకుండా మిగిలిన రైళ్లు యథావిధిగా నడవనున్నాయి.

ఈనెల 23 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- తిరుపతి-విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్

ఈనెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- రాజమండ్రి-విశాఖపట్నం(07466) మెము పాసింజర్, విశాఖపట్నం-రాజమండ్రి(07467) మెము పాసింజర్, మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు - రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విజయవాడ-విశాఖపట్నం(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-విజయవాడ(12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు (22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం (22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నడిచే రోజులలో), విశాఖపట్నం-తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.

ఈనెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం-మచిలీపట్నం(17220)ఎక్స్‌ప్రెస్,విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విశాఖపట్నం (12806)జన్మభూమి ఎక్స్‌ప్రెస్.

వాల్తేర్ డివిజన్ పరిధిలో..

ఈనెల 24వ తేదీన రద్దయిన రైళ్లు

పలాస-విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-పలాస(07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, గుణుపూర్-విశాఖపట్నం(08521) పాసింజర్‌స్పెషల్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-భువనేశ్వర్(22820) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-భవానిపట్న(08504) పాసింజర్ స్పెషల్

ఈనెల 25న రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-విశాఖపట్నం(22819) ఎక్స్‌ప్రెస్, భవానిపట్నం-విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్

పలు రైళ్లు రీ షెడ్యూల్

- ఈ నెల 24న మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే పూరీ-గుణుపూర్(184417) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1గంటకు బయల్దేరుతుంది.
- ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరాల్సిన ఛత్రపతి శివాజీ ముంబయి టెర్మినస్- భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా సాయంత్రం 5గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 5.20 గంటలకు బయల్దేరాల్సిన రాయ్‌పూర్-విశాఖపట్నం 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24న ఉదయం 8.20 గంటలకు బయల్దేరాల్సిన కోరాపుట్ -విశాఖపట్నం(08545) పాసింజర్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-బ్రహ్మపూర్(08532) పాసింజర్ గంట ఆలస్యంగా 6.45 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన సంబల్‌పూర్-నాందేడ్(208090 ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా 11.50 గంటలకు బయల్దేరుతుంది.
- ఈనెల 24వ తేదీన తెల్లవారు 4.30 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్-షాలిమర్(07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం7.30గంటలకు బయల్దేరుతుంది.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులేట్

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 30, జూలై 7,14,21,28, ఆగస్టు 4వ తేదీన యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్-టాటా (18112) ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ డివిజన్ పరిధిలో గంట సేపు ఆయా స్టేషన్లలో నిలిపివేయనున్నారు.

క్లుప్తంగా

వజ్ర కవచాలంకృత గోవింద



కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామి వజ్ర కవచాలంకృత ధారణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. దీప హారతి నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, గోవిందనామ పారాయణ చేశారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట: తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 6వ తరగతిలో ఎస్సీలకు 29, ఎస్టీ, బీసీలకు చెరొకటి, 7వ తరగతిలో ఎస్సీలకు 3, ఎనిమిదో తరగతిలో ఎస్సీలకు 2, ఓసీలకు ఒకటి, 9వ తరగతిలో ఎస్సీలకు 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26లోగా గురుకుల పాఠశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వేతన బకాయిల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: తమకు రావలసిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయంవద్ద శనివారం ధర్నా చేశారు. ఏడు నెలలుగా రావలసిన వేతనాలు చెల్లించకపోతే ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యాలయంలో కూడా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ సోమరాజుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్ షాప్ మూర్తి	:సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	:శ్రీసత్య
హరోం హర	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 110 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,060	5,190
రెండో రకం	4,080	4,050
మూడోరకం	3,240	3,900

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-19 యూనిట్లు, బి పాజిటివ్-6 యూనిట్లు, ఒ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 295 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వ్యాధుల కాలం.. పశువులు భద్రం

- పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణానికే అపాయం
- 1962కు ఫోన్ చేస్తే పశువుల వద్దకే వైద్యం



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది



తుమ్మపాల: వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యాధులు ముప్పేట దాడి చేస్తాయి. ఈ కాలంలో పశువుల సంరక్షణ చర్యలు ఎంతో అవసరం. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని చెబుతున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆస్పత్రికి తరలించలేని పరిస్థితిలో ఉన్నా 1962కు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వచ్చి పశు వైద్యులు సేవలు అందిస్తున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలిస్తారు.

అనకాపల్లి మండలంలో పశువుల వివరాలు	
ఆవులు	8,748
గేదెలు	13,676
గొర్రెలు	4,000
మేకలు	6,500

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు నట్టల వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చిమేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ రావడంతో పాటు శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జులై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారిన పడిన పశువును మిగిలిన వాటి నుంచి దూరం చేయాలి.

వ్యాక్సిన్‌తో 'చిటుకు' కు చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణ కోసం జూన్, జులై నెలల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.

'గాలికుంటు'తో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

పీడించే 'జలగ'

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంతో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్ల నియోజడ ప్లస్‌ను అందించాలి.

ఉచితంగా టీకాలు వేస్తున్నాం



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే ఆవకాశం ఎక్కువ. వ్యాధినివారణ టీకాలు వేయిస్తే వాటి ప్రభావం ఆరు నెలల వరకూ ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. గొర్రెలు, మేకలకు ఈ ఏడాది 10 వేల వరకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే వచ్చి వైద్య సేవలు అందిస్తాం. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశు వైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించవచ్చు.

– డాక్టర్ అనిల్, మండలం పశుసంవర్ధక శాఖ అధికారి, అనకాపల్లి మండలం.

పోలీస్ స్టేషన్ కూడలిలో సోలార్ వెలుగులు



వెలుగులు విరజిమ్ముతున్న సోలార్ విద్యుత్ దీపాలు

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద కూడలిలో జాతీయ రహదారిపై సోలార్ విద్యుత్ దీప వెలుగులు విరజిమ్ముతున్నాయి. జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు మంజూరు చేసిన రూ.24 లక్షలతో కూడలిలో రోడ్డుకు రెండు వైపులా పదేసి చొప్పున సార్వత్రిక ఎన్నికల కొంటింగ్‌కు ముందు స్తంభాలు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ దీపాలను అమర్చారు. అవి ప్రతి రోజూ సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు వెలుగులు విరజిమ్ముతున్నాయి. గతంలో చీకటి పడిందంటే కూడలి దాటడానికి ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడేవారు. అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతుండేవారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకానికి టెండర్ల ఆహ్వానం

అనకాపల్లి: కొత్తూరు పంచాయతీ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పారిశుధ్య ట్రాక్టర్ల డ్రైవర్ల నియామకానికి 2024–25 సంవత్సరానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు సర్పంచ్ ఎస్.లక్ష్మీప్రసన్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం 11నుంచి 2 గంటల వరకు టెండర్లు స్వీకరించి, మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు దారుల సమక్షంలో తెరవనున్నట్టు ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు కొత్తూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని సంప్రదించాలని ఆమె కోరారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



ప్రైవేట్ పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి: జిల్లాలోఅధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పూల్‌బాగ్‌రోడ్డులో ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయంపై విద్యాశాఖాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో ధర్నా చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్,తాతాజీ, రాకేష్,సంపత్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హరేకృష్ణ ఆశ్రమ భవనం ప్రారంభం

అనకాపల్లి: స్థానిక జాతీయరహదారి జలగల మదుం సమీపంలో హరేకృష్ణ సత్సంగ ఆశ్రమ నూతన భవనాన్ని ప్రారంభించినట్టు ఆశ్రమ అధ్యక్షుడు దుర్గభ కృష్ణ ప్రేమదాస్ చెప్పారు. అక్కడ శనివారం జగన్నాథ స్వామి, బలదేవ, సుభద్రా దేవిల మూర్తులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్వామి వారికి కలశారాధన, శ్రీ లక్ష్మీనృసింహ శ్రీ సుదర్శన మహాయజ్ఞం, మహాకలశాభిషేకం, శ్రీ మద్భాగవత ప్రవచనం, మధ్యాహ్నం అన్నసమారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించినట్టు చెప్పారు. భవ్య డెవలపర్స్ చైర్మన్ కాండ్రేగుల నాయుడు ఉచితంగా అందజేసిన 15 సెంట్ల స్థలంలో ఆశ్రమాన్ని నిర్మించినట్టు ఆయన తెలిపారు.

ఐదుగురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో తహసీల్దారు వెంకటరమణ, ట్రస్ట్ ప్రతినిధులు

కోటవురట్ల : విద్యతోనే ఉన్నతి సాధ్యమని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి అంజనీకుమార్ జ్ఞాపకార్థం ఐదుగురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదును శనివారం అందించారు. ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థి అయిన అంజనీకుమార్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు, మిత్రులు కలిసి అంజనీ కుమార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం బాగా చదివే విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ప్రతి సంవత్సరం రూ.లక్ష నగదును విద్యార్థుల చదువుకు ప్రోత్సాహంగా ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎం ఎం.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా ట్రస్ట్ ప్రతినిధులు ఎం.ఎస్.ప్రకాష్, ఎల్ఎల్ఎం స్వామి ఆధ్వర్యంలో తహసీల్దారు వెంకటరమణ చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు పంపిణీ నిర్వహించారు. గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ఆరుగురికి నగదు అందజేశారు. వరుసగా వై.సిరి సుష్మిత ప్రేమ్‌కు రూ.30 వేలు, పి.హేమంత్‌కుమార్, జి.పావనిలకు రూ.20 వేలు చొప్పున, ఎస్.జస్వంత్, ఎం.విజయ్‌నాగేంద్ర, సి.రాములకు రూ.10 వేలు చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరగ్రామానికి రక్షణ ఏదీ

- పంపానదికి ఆనుకుని వెంకటనగరం గ్రామం
- రక్షణ గోడ లేక ముంపు ముప్పు
- వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవంటున్న గ్రామస్తులు
- రక్షణగోడ నిర్మించాలని వేడుకోలు



పంపానది ఒడ్డున ఉన్న వెంకటనగరం గ్రామం

పాయకరావుపేట : మండలంలో గల తీరప్రాంత గ్రామమైన వెంకటనగరానికి రక్షణ గోడ లేకపోవడంతో ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకటనగరంలో సుమారు 5 వేల మంది జనాభా ఉన్నారు. అందరూ మత్స్యకారులే. గ్రామానికి ఆనుకొని పంపానది నిత్యం నిండుగా ప్రవహిస్తుంది. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వద్ద నున్న డామ్ ద్వారా విడుదల చేస్తున్న నీరు పంపానది ద్వారా ప్రవహిస్తోంది. మండలంలో గల కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజానగరం, రాజవరం గ్రామాల సమీపాన పంపానది ప్రవహిస్తూ వెంకటనగరం గ్రామం వద్ద సముద్రంతో అనుసంధానం అయిన ఉప్పుటేరులో కలుస్తుంది. ఎక్కువగా వర్షాలు, వరదలు సంభవించేటప్పుడు, అన్నవరం బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేసేటప్పుడు కూడా నది పూర్తి స్థాయిలో ప్రవహిస్తోంది. ఎక్కువగా వరదలు సంభవించే సమయంలో పంపానది పొంగి పొర్లుతూ ఒడ్డున ఉన్న వెంకటనగరానికి నది ప్రవాహం తాకిడి తగులుతుంది. గ్రామం కూడా నది మట్టానికి ఆనుకుని ఉండడం వల్ల నదిలో ఏమాత్రం నీటి ప్రవాహం పెరిగినా గ్రామంలోకి ప్రవేశిస్తుంది. దీంతో ఆ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం పొడవునా రక్షణ గోడ నిర్మాణం చేపడితే వరద నీటి నుంచి రక్షణ పొందుతామని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

రక్షణ గోడ నిర్మించాలి



పంపానదికి రక్షణ గోడ నిర్మిస్తే వరదలు సంభవించినప్పుడు గ్రామానికి ముప్పు తప్పుతుంది. గతంలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. గోడ నిర్మాణం చేపట్టి గ్రామానికి రక్షణ కల్పించాలి.

–చోడిపల్లి శ్రీనివాస్, మత్స్యకార నాయకుడు, వెంకటనగరం

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



వేంకటేశ్వర స్వామి ఆలయకమిటీ చైర్మన్ ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మునగపాక వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో పలువురు దాతలు ముందుకొస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని వాడ్రాపల్లికి చెందిన పెతకంశెట్టి రామజోగినాయుడు తన వంతుగా రూ.10,016, మళ్ల సింహాచలం, మహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు అప్పలనాయుడు రూ.10,016 వెరసి రూ.20,032 విరాళంగా కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆడారి కృష్ణ,కాండ్రేగుల జగ్గారావు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు ముందస్తు ప్రణాళికలు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న వ్యాధులను నివారించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో డ్రైనేజీలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డయేరియా వ్యాపించకుండా రక్షిత పథకాలను క్లోరినేషన్ విధిగా చేయాలన్నారు. కాచిన నీళ్లు తాగాలని, ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణ కార్యక్రమం చేయాలని ఆదేశించిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు చేయాలన్నారు. వీటితో పాటు పంచాయతీ కార్యదర్శులు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. తాండవ నదిలో నిర్మించిన తాగునీటి పైలట్ ప్రాజెక్టు నుంచి 16 పంచాయతీల ప్రజలకు తాగు నీరు సరఫరా చేయడంతో తరుచూ క్లోరినేషన్ వంటి పనులు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు రోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయన్నా

అతిసారపై ముందస్తు జాగ్రత్త చర్యలు

మాకవరపాలెం: అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు, వైద్యాధికారులు శ్రీవిద్య, చరణ్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇక గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులను ఆదేశించారు.

విత్తనశుద్ధితో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం: ఖరీఫ్ సాగు కోసం వరి విత్తనాలు వేసుకునే రైతులంతా కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో శైలజ తెలిపారు. స్థానిక ఆర్బీకేలో శనివారం ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల నారు పోసిన ప్రతి గింజ మొలకెత్తుతుందన్నారు. దీని వల్ల రైతుకు వరినారు సమస్య లేకుండా ఉంటుందన్నారు. వరి విత్తనాలు 30 కేజీలకు 250 గ్రాముల సుడోమోనాస్ పొడరు వరినారు వేసే ముందు రోజున కలపాలన్నారు. దీని వల్ల విత్తనాల్లో క్రిమికీటకాలు నాశనమవుతాయన్నారు. వరి నారు ఏపుగా పెరుగుతుందన్నారు. విత్తన శుద్ధి చేసే సుడోమోనాస్ మందు 50 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. సుడోమోనాస్ కేజీ ప్యాకెట్ రాయితీ పోగా రూ.40కే ఇస్తున్నామన్నారు. మండలంలో ఆర్బీకేల్లో 500 కేజీల సుడోమోనాస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల ఆయకట్టులో వరినాట్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు సాగుకు తగ్గట్టుగా వివిధ రకాల వరి విత్తనాలు 1,700 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ముందుగా ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి పంపిణీ చేస్తున్నామన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

మునగపాక :వర్షాకాలంలో ఎటువంటి వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. స్థానిక సంపదత యారీ కేంద్రంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో డయేరియా సమస్య రాకుండా చూడాలన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'



ర్యాలీ నిర్వహిస్తున్న గొల్లపేట ఎంపీపీ స్కూల్ విద్యార్థులు

కోటవురట్ల : నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెచ్ఎం జీవన్ కోరారు. స్థానిక గొల్లపేట ఎంపీపీ స్కూల్ విద్యార్థులు శనివారం నేను బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నుంచి వీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని నినదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్య లభిస్తోందని వివరించారు. ఉపాధ్యాయిని కుమారి, అంగన్‌వాడీ టీచర్ ఎస్తేరురాణి, ఏఎన్ఎం రామలక్ష్మి, సీహెచ్‌వో రంజిత, మహిళా పోలీసు భారతి పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని తోటాడ సచివాలయం వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలను శనివారం అందజేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మిల చేతుల మీదుగా విత్తన పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయంలో రాణించవచ్చన్నారు. మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు, రైతులు ఆడారి జగన్నాథరావు, నాయుడు, చదరం భాస్కరరావు, కాశీరావు పాల్గొన్నారు.